సాక్షి
అనంతపురం
మంగళవారం | 8 | జూలై | 2025



గంజాయి ముఠా గుట్టు రట్టు
గంజాయి ముఠాగుట్టును రాయదుర్గం పోలీసులు రట్టు చేశారు. పది మంది నిందితులను అరెస్టు చేశారు.
8లో



కొనసాగుతున్న వరద
తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో 52,566, అవుట్‌ఫ్లో 61,677 క్యూసెక్కులు ఉంది. 19 క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని నదికి వదులుతున్నారు.

గరిష్టం/కనిష్టం
32.0°/21.4°
జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఈఏపీ సెట్ అభ్యర్థులకు 'హెల్ప్‌లైన్'

అనంతపురం: ఏపీ ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభమైన నేపథ్యంలో అభ్యర్థుల సందేహాల నివృత్తికి అనంతపురంలోని జేఎన్‌టీయూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జేఎన్‌టీయూలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్ సురేష్ బాబును, పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయచంద్రా రెడ్డిని సంప్రదించవచ్చు.

రెండు వేల ఎకరాల్లో ఉద్యాన మొక్కలు నాటాలి

అనంతపురం అర్బన్: ఈ నెలాఖరులోగా జిల్లా వ్యాప్తంగా రెండు వేల ఎకరాల్లో ఉద్యాన మొక్కలు నాటాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్, పీటీఎం 2.0పై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్లాంటేషన్ లక్ష్యం మేరకు ఈ నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈ నెల 10న చేపట్టనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) 2.0లో సాక్షులుగా సచివాలయ సిబ్బంది రిజిస్ట్రేషన్, విద్యాసంస్థలకు కావాల్సిన మొక్కల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డ్వామా పీడీ సలీమ్‌బాషా పాల్గొన్నారు.

వెల్లువెత్తిన వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పామిడి: పట్టణంలోని జగన్నాథ పద్మావతి కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రీసర్వే సమస్యలు, పేదల ఇళ్ల స్థలాల ఆక్రమణ, టిడ్కో ఇళ్ల రద్దు, భూవివాదాలు, విద్యుత్ సమస్యలు తదితర వాటిపై 567 అర్జీలు అందాయి. టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంకు రుణాలు రద్దు చేయించాలని, పేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు ఇవ్వాలని, రూ.5 లక్షల యూనిట్ వ్యయంతో ఇళ్లు నిర్మించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కే రహీమ్‌తో పాటు పలువురు పేదలు కలెక్టరుకు విన్నవించారు. విద్యుత్ చార్జీల తగ్గింపుతో పాటు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ స్థలం, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. పామిడి కమ్యూనిటీ ఆసుపత్రికి 50 పడకలను కేటాయించాలన్నారు. బదిలీల కౌన్సెలింగ్ త్వరగా చేపట్టాలని సచివాలయ నర్సులు అర్జీ సమర్పించారు. ఇక్కడ అందిన వినతులను గడువులోపు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సి.షర్మిల పాల్గొన్నారు.

జలధి తరంగం



అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న గూగూడు కుళ్లాయిస్వామి పీరు

భక్తజన సంద్రమైన గూగూడు

- మార్మోగిన కుళ్లాయిస్వామి నామస్మరణ
- కనుల పండువగా అగ్ని గుండ ప్రవేశం, జలధి కార్యక్రమం
- మొహర్రం వేడుకల్లో కీలకఘట్టం పరిసమాప్తం

నార్పల: గూగూడు భక్తజన సంద్రమైంది. ఇసుకేస్తే రాలనంత మందితో కిక్కిరిసిపోయింది. కుళ్లాయి స్వామి నామస్మరణతో మార్మోగింది. గూగూడు కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాల్లో కీలక ఘట్టమైన జలధి ఉత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. మొదటగా భక్తులు స్వామివారు నడిచే అగ్నిగుండంలో నిప్పులను చదును చేశారు. ప్రధాన అర్చకుడు హుసేనప్ప స్వామి వార్లకు చక్కెర చదివింపులు చేశారు. అనంతరం సన్నాయి వాయిద్యాల నడుమ, కొబ్బరి దివిటీల వెలుగులో కొండారెడ్డి వంశస్తులు కుళ్లాయి స్వామి పీరుతో సహా తక్కిన పీర్లను ఎత్తుకుని తెల్లవారుజామున వాడవాడలా తిరుగుతూ గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు అగ్నిగుండ ప్రవేశం చేశారు. తిరిగి సాయంత్రం పీర్లను ఎత్తుకుని గ్రామ ప్రధాన వీధులలో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. చివరగా గ్రామ సమీపంలోని దిగుడుబావి వద్దకు స్వామివారి పీర్లను తీసుకెళ్లి జలధి కార్యక్రమం పూర్తి చేశారు. జలధి ఉత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దాదాపు 1,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేపు చివరి దర్శనం

గూగూడు కుళ్లాయిస్వామి చివరి దర్శనం బుధవారం సాయంత్రం ఆరు గంటలకు ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు.



అగ్నిగుండం చుట్టూ పీర్లను ప్రదక్షిణ చేయిస్తున్న దృశ్యం



కుళ్లాయిస్వామిని శరణు వేడుతున్న భక్తులు



సన్నాయి వాయిద్యాల నడుమ పీర్ల ఊరేగింపు

జన హృదయ నేత వైఎస్సార్

- లక్షలాది మందికి పునర్జన్మనిచ్చిన ఆరోగ్యశ్రీ
- అనంతరం 108, 104 పథకాలు అమల్లోకి తెచ్చిన మహానేత
- కరువుతో అల్లాడుతున్న సమయంలో అనంతకు వైఎస్ ఆసరా
- జిల్లాలో సాగు, తాగునీటి కష్టాలు తీర్చింది వైఎస్సారే
- రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో ఊరట
- అద్భుత పథకాల ఆవిష్కర్త డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి నేడు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఒక పథకం దేశం కాదు ప్రపంచం దృష్టినే ఆకర్షించడం సామాన్య విషయం కాదు. ఏకంగా ప్రపంచబ్యాంకు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వంటి సంస్థలు ఆరోగ్యశ్రీని పొగిడాయంటే ఈ పథకం ఎలాంటిదో అంచనా వేయొచ్చు. ఆరోగ్యశ్రీ.. ఈ పథకం పేరు వినగానే దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గుర్తుకు వస్తారు. దేశవ్యాప్తంగా ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా పథకాల రూపకర్తగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

ఆరోగ్యశ్రీ పురుడు పోసుకుంది అనంతలోనే

2004 సంవత్సరానికి ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా అత్యంత కరువు ప్రాంతం. పదిరూపాయలు పెట్టి వైద్యం కూడా చేయించుకోలేని దుస్థితి. ఇలాంటి సమయంలో మొదటి దశలో అనంతపురం జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఇక్కడే పథకం పురుడు పోసుకుంది. అనంతపురంతో పాటు మహబూబ్‌నగర్, శ్రీకాకుళంలో ఒకేరోజు ఈ పథకాన్ని ప్రారంభించారు. 168 వ్యాధులతో ప్రారంభమైన ఈ పథకం తర్వాత 958 చికిత్సలకు వైద్యం అందించింది. ఈ పథకం ద్వారా పేదలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం పొందారు. పుట్టుకతోనే చెవిటి మూగ ఉన్న పిల్లలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షలు వెచ్చించి కాక్లియర్ ఇంప్లాంట్స్ వేయించిన ఘనత వైఎస్సార్ దేనని అందరికీ తెలిసిందే.

108, 104 పథకాలు...

ఆపదలో నేనున్నానంటూ కుయ్ కుయ్‌మంటూ వచ్చే 108 వాహనాల రూపకర్తా వైఎస్సారే. ప్రమాదంలో గాయపడి నిస్సహాయ స్థితిలో ఉండే వేలాదిమందికి ఈ వాహనాలే ప్రాణభిక్ష పెట్టాయి. రాత్రనకా పగలనకా ఏ సమయంలో పిలిచినా పలికే ఈ వాహనాల పథకాన్ని వైఎస్సార్ సృష్టించారు. ఈ పథకం ఆ తర్వాత దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలూ అమలు చేశాయి. వైద్య సలహాల కోసం 104 పథకాన్నీ రూపొందించారు. 104కు ఫోన్ చేస్తే చాలు వైద్య సలహాలు అందేవి. వైఎస్సార్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్, పంట రుణాల మాఫీ, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాల ద్వారా లబ్ధిపొందిన ప్రజలు ఇప్పటికీ ఆయన్ను గుర్తు చేసుకుంటూనే ఉన్నారు.

దార్శనికుడు వైఎస్సార్

జిల్లాలో కరువు నివారణలో భాగంగా సాగు – తాగు నీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన దార్శనికుడు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి. 2004లో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక తాగునీటి పథకంగా ఉన్న హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టును సాగునీటి ప్రాజెక్టుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లోనే ఫేజ్–1కు రూ.1,305 కోట్లు, ఫేజ్–2కు రూ.1,880 కోట్లు విడుదల చేశారు. ఆయన హయాంలోనే ఫేజ్–1 పనులను పూర్తి చేశారు. ఫేజ్–2 పనులు 60శాతం మేర పూర్తి చేశారు. 2008 నుంచి ఏటా హంద్రీ–నీవా ద్వారా కృష్ణాజలాలు జిల్లాకు వస్తున్నాయి. అలాగే తుంగభద్ర ఎగువ కాలువ ప్రాజెక్టు ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. తుంగభద్ర జలాశయం నుంచి జిల్లాలోని కణేకల్లు వరకు కర్ణాటక పరిధిలో హెచ్చెల్సీ ఉంటుంది. అక్కడి నుంచి హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీ, మిడ్‌పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఇదిలా ఉంటే ఆనాడు కరువు పరిస్థితులతో తాగునీళ్లో రామచంద్రా అనే పరిస్థితులు జిల్లాలో ఉండేవి. కిలోమీటర్ల మేర దూరంలోని వ్యవసాయబోర్ల నుంచి తాగునీటిని తెచ్చుకునే వారు. నేడు జిల్లాలో శాశ్వతంగా తాగునీటి ఇబ్బందులు తొలగిపోయావంటే అది మహానేత వైఎస్సార్ చలవే అని చెప్పుకోవాలి. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పీఏబీఆర్ రిజర్వాయర్ నుంచి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా ఉరవకొండ నియోజకవర్గం నుంచి హిందూపురం వరకు తాగునీటిని అందించారు. అనంతపురం నగరానికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తాగునీటి పథకాన్ని తీసుకొచ్చారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారానే జిల్లాలో 60 శాతానికి పైగా జనాభాకు నేడు తాగునీటి సరఫరా జరుగుతోంది. భవిష్యత్‌లో తాగునీటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు పీఏబీఆర్‌కు తుంగభద్ర జలాశయం నుంచి 10 టీఎంసీలు ప్రత్యేకంగా నీటి కేటాయింపులు చేశారు. తుంగభద్ర నుంచి కేసీ కెనాల్ వాటా నీటిని పోతిరెడ్డి పాడు నుంచి తీసుకుంటూ... కేసీ కెనాల్ వాటా పీఏబీఆర్‌కు మళ్లించారు. దామాషా ప్రకారం ఏటా సగటున 4 టీఎంసీలకు పైగా అదనపు జలాలు వస్తున్నాయి.

2019నుంచి ఇప్పటివరకు జిల్లాలో ఆరోగ్యశ్రీలో లబ్ధిపొందిన వారి వివరాలు

ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు	2,53,466
దీనికోసం అయిన వ్యయం	రూ.542.12 కోట్లు
ఆరోగ్య ఆసరా లబ్ధిదారులు	1,19,119
దీనికోసం అయిన వ్యయం	రూ.61.058 కోట్లు
మొత్తం లబ్ధిదారులు	3,72,585
మొత్తం వ్యయం	రూ.603.178 కోట్లు

జన హృదయ నేత వైఎస్సార్

ప్రజల మనిషి వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆయన మరణించినా అందరి హృదయాల్లో సుస్థిర స్థానం ఏర్పరుచుకున్నారు. కష్ట కాలంలో రుణ మాఫీతో పాటు రుణాలు సరిగా చెల్లించిన తమలాంటి వారికి చేయూతనిచ్చారు. మా కుటుంబానికి రూ.లక్ష దాకా అప్పట్లో రుణ ఉపశమనం లభించింది. కృష్ణా జలాలను అందించి కరువును పారదోలారు. ప్రతి నీటి బొట్టులోనూ వైఎస్ కనిపిస్తారు.

– మేడాపురం గాండ్ల అశ్వర్థనారాయణ, చిన్నబోయనపల్లి, కొత్తచెరువు మండలం

వడ్డీ వ్యాపారుల దాష్టీకం

- వడ్డీ చెల్లింపు ఆలస్యమైనందుకు బంగారు వ్యాపారిపై భౌతిక దాడి



బాబ్జాన్‌పై దాడి చేస్తున్న వడ్డీ వ్యాపారులు

అనంతపురం: నగరంలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు శ్రుతిమించాయి. వడ్డీ చెల్లింపు కాస్త ఆలస్యమైనందుకు బంగారు వ్యాపారిపై భౌతిక దాడి చేశారు. విచక్షణారహితంగా బూతులు తిడుతూ నడిరోడ్డుపైనే కాలితో తన్నుతూ కింద పడేసి కొట్టారు. దీంతో బాధితుడితో పాటు మరికొందరు బంగారు వ్యాపారులు స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరుకుని వడ్డీ వ్యాపారుల దాష్టీకాలపై ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం పాతూరుకు చెందిన తిరుపాల్ వద్ద బంగారు వ్యాపారి బాబ్జాన్ రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. వంద రూపాయలకు నెలకు రూ.10 చొప్పున వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. ఇలా ఇప్పటిదాకా దాదాపు రూ.10 లక్షలు వడ్డీ రూపంలో చెల్లించాడు. ఈ నెల కొంచెం ఆలస్యమైంది. దీంతో తిరుపాల్, అతని కుమారులు సూరి, శేషు ముగ్గురూ కలిసి వడ్డీ సరైన సమయానికి చెల్లించకపోతే ఎలా రా అంటూ విచక్షణారహితంగా దాడి చేశారు. అక్కడే ఉన్న కొంత మంది నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా..వారిపైనా దాడికి తెగబడ్డారు. దీంతో దాదాపు వంద మంది బంగారు వ్యాపారులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకు వెళ్లారు. వడ్డీ వ్యాపారస్తుల ఆగడాలను భరించలేకపోతున్నామని, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వడ్డీ డబ్బులు సకాలంలో ఇవ్వకపోతే భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు మహిళలను కూడా వేధిస్తున్నారని వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు తిరుపాల్, అతని కుమారులు సూరి, శేషు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.

ఉపాధి, ఇసుకలో 'తమ్ముళ్ల' దోపిడీ

- టీడీపీ నాయకుల అక్రమాలపై విచారణ చేపట్టాలి
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



ఉపాధి పథకంలో అక్రమాలపై ఆధారాలు చూపుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే..టీడీపీ నాయకులు మాత్రం ఉపాధి హామీ పథకంలో అవినీతి, ఇసుక అక్రమ రవాణాతో రెండు చేతులా అక్రమార్జనకు పాల్పడుతున్నారని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్ విమర్శించారు. వీటిపై సమగ్ర విచారణ చేపట్టకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయన సోమవారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు అన్యాయం జరుగుతోందన్నారు. 'శ్రామికుల శ్రమ' అని పలికే పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం తదితర ప్రాంతాల్లో ఫొటోలను మార్పులు చేసి ఉపాధి పథకంలో అవినీతికి పాల్పడ్డారంటూ అందుకు సంబంధించి ఆధారాలను మీడియాకు చూపారు. ఈ అక్రమాలను గ్రామ సర్పంచ్ ప్రశ్నిస్తే గతంలో చేసిన పనులను పెండింగ్‌లో ఉంచి టీడీపీ నాయకులు పరోక్షంగా బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. మస్టర్లలో లేని వారికి ఫీల్డ్ అసిస్టెంట్ల కనుసన్నల్లో డబ్బులిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. విచారణ చేస్తున్నామని బుక్కరాయసముద్రం ఎంపీడీఓ చెబుతున్నారని, అందులో ఏ మేరకు నిజాలు నిగ్గు తేలుతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఉపాధి పథకంలో జిల్లా అంతటా అవినీతి జరుగుతోందని, పాత పనులకే అడ్డగోలుగా బిల్లులు చేస్తున్నారని, వీటిపై కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

అనంతపురం రూరల్, బుక్కరాయసముద్రం, యల్లనూరు, రాయదుర్గం, ఉల్లికల్లు, కళ్యాణదుర్గం, శింగనమల తదితర ప్రాంతాల్లో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోందన్నారు. చిన్న జలాలపురం, నిదనవాడలో టీడీపీ నాయకులు సవాళ్లు విసురుతూ ఇసుకను తోడేస్తున్నారన్నారు. ఇసుకను ఇలా తోడేస్తూపోతే భూగర్భ జలాలు అడుగంటి భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో పాలన పూర్తిగా కుంటుపడిందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులను, న్యూట్రల్ గొంతులను అణచి వేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందని విమర్శించారు. మిర్చి, మొక్కజొన్న, పసుపు, వరి, పొగాకు, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే ఆ పార్టీకి చెందిన వ్యక్తినే హత్య చేయాలని చూసినట్లు వారే చెబుతున్నారన్నారు. అదే విధంగా కళ్యాణదుర్గం స్టాంపు డ్యూటీ కుంభకోణంలో అధికార పార్టీ నేతలు పరస్పర ఆరోపణలు చేసుకున్నారని గుర్తు చేశారు.

కలెక్టర్, ఎస్పీ ఆలోచించాలి

జిల్లాలో దళితులపై అకృత్యాలు పెరిగాయని, అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయని, వీటిపై కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ ఆలోచించాల్సిన అవసరం ఉందని శైలజానాథ్ సూచించారు. ఏడుగుర్రాలపల్లిలో సామూహిక అత్యాచారానికి గురైన మైనర్ బాలికకు న్యాయం జరగడం లేదన్నారు. జిల్లాలో మద్యం బెల్టుషాపు లేని ఊరంటూ లేదన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు దాదు, నాయకులు ఉదయ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చాక్లెట్ ఇవ్వలేదని తిట్టినందుకు మహిళ హత్య!

ధర్మవరం అర్బన్: పట్టణంలోని గీతానగర్‌కు చెందిన మహిళ మృతి కేసులో చిక్కుముడి వీడినట్లు తెలుస్తోంది. చాక్లెట్ ఇవ్వలేదని తిట్టినందుకు ఎదురింటిలోని వ్యక్తి ఆమెను కడతేర్చినట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. రమాదేవి (55) అనే మహిళ గీతానగర్‌లో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఆమె ఎదురింట్లో ఉంటున్న రాజశేఖర్ కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా జూన్ 29న వార్డులోని వారికి చాక్లెట్లు పంచేందుకు పంపించాడు. అయితే అందరికీ పంచి చివరగా ఎదురింట్లో ఉన్న రమాదేవికి చాక్లెట్ ఇవ్వబోతే ఆమె తీసుకోకపోగా బాలుడి తండ్రిని దూషించింది. దీంతో రాజశేఖర్.. రమాదేవి ఇంటికెళ్లి గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపంలో కిందకు తోయడంతో స్పృహ కోల్పోయిన రమాదేవిని.. టవల్‌తో గొంతు బిగించాడు. ఆమె మృతి చెందిందనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత స్థానికులు గమనించి ఆమెను ఆస్పత్రిలో చేర్చారు. అప్పటి నుంచి రాజశేఖర్ ఆస్పత్రిలోనే ఎక్కువగా ఉంటూ ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరా తీస్తుండేవాడు. పరిస్థితి విషమించి ఈ నెల నాలుగో తేదీన రమాదేవి మృతి చెందింది. పోస్టుమార్టం వరకు కూడా అతను ఆస్పత్రిలో హడావుడిగా తిరిగాడు. అనంతరం సీఐ నాగేంద్రప్రసాద్ ఆమె మృతిపై వార్డులో విచారణ చేపట్టారు. అనుమానితుడి కింద రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో రాజశేఖర్ ఆమెను చంపినట్లు అంగీకరించారని తెలుస్తోంది. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించలేదు. మరో రెండు రోజుల్లో కేసు వివరాలు, నిందితుడి అరెస్టు గురించి వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

అనంతపురం సెంట్రల్: ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతులు నష్టపోకుండా 2025 సంవత్సరానికి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పునర్మించిన వాతావరణ పంటల బీమా (ఆర్‌డబ్ల్యూసీబీఐఎస్) పథకాలను అమలు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ఆహార, నూనె గింజల పంటలన్నింటికీ బీమా వర్తిస్తుందన్నారు. ఖరీఫ్‌లో ప్రీమియం 2 శాతం, రబీ కాలంలో ప్రీమియం 1.5 శాతం మాత్రమే రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాణిజ్య ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం చెల్లించాలన్నారు. రైతు కట్టగా మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం సగం చొప్పున భరిస్తాయని పేర్కొన్నారు. దిగుబడి ఆధారంగా కంది పంటను గ్రామం యూనిట్‌గా, వరి జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలను మండలం యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. వేరుశనగ, పత్తి, ఉద్యాన పంటలైన దానిమ్మ, బత్తాయి, టమోట, అరటి పంటలకు మండలాన్ని యూనిట్‌గా తీసుకొని వాతావరణ బీమాను లెక్కిస్తారని చెప్పారు. కంది పంటకు హెక్టారుకు రూ.200, వరికి రూ.410, జొన్నకు రూ.210, మొక్కజొన్నకు రూ.330, ఆముదంకు రూ.200, ఎండు మిరప రూ.1400 చెల్లించాలన్నారు. అలాగే రైతులు వేరుశనగకు హెక్టారుకు రూ.1600, పత్తి రూ.1600, దానిమ్మకు రూ.9,375, చీనీకి రూ. 6,875, టమాట రూ.4 వేలు, అరటికి హెక్టారుకు రూ.7,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

బొమ్మనహాళ్: మండలంలోని మైలాపురంలో కొలనగాహళ్లికి చెందిన అనంతరాజు అనే వ్యక్తిపై సోమవారం రాత్రి హత్యాయత్నం జరిగింది. గ్రామస్తుల వివరాలమేరకు.. అనంతరాజు మైలాపురానికి సోమవారం రాత్రి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన లోకేష్, విజయ్.. అనంతరాజు బైక్‌ను ధ్వంసం చేసి అతనిపైనా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అనంతరాజును బళ్లారి విమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే బాధితుని బంధువులు మైలాపురానికి చేరుకోవడంలో ఉద్రిక్తత నెలకొంది. లోకేష్, విజయ్‌ల ఇళ్లలోకి వెళ్లి తలుపులు, టీవీ, సామగ్రిని పగలకొట్టి, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కారును ధ్వంసం చేసి గడ్డివాముకు నిప్పు పెట్టారు. పోలీసులు గ్రామంలో పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహిస్తున్నారు. వివాహేతర సంబంధమే ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

భక్తజన సంద్రం


బత్తలపల్లిలో పీర్ల భేటీ తిలకించేందుకు వచ్చిన ప్రజలు

34 ఏళ్ల తర్వాత భేటీకి వచ్చిన పీర్లు


బత్తలపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న మల్కాపురం గ్రామ పీర్లు

మొహర్రం ఉత్సవాల్లో 34 ఏళ్ల తర్వాత ధర్మవరం మండలం మల్కాపురం పీర్లు భేటీ కోసం బత్తలపల్లికి వచ్చాయి. గతంలో మండలంలోని 24 గ్రామాల పీర్లు వెంకటగారిపల్లి సత్రం వద్ద భేటీ అయ్యేవి. 1992లో అక్కడ అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడం వల్ల భేటీకి కొన్ని గ్రామాల పీర్లు వెళ్లడం లేదు. అప్పటి నుంచి మల్కాపురం పీర్లు కూడా భేటీకి వెళ్లడం లేదు. ఇప్పుడు బత్తలపల్లి కూడలిలో సోమవారం జరిగిన భేటీకి ఆ గ్రామానికి చెందిన పీర్లు రావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మల్కాపురంలో గ్రామోత్సవం అనంతరం పోట్లమర్రికి చేరుకున్న పీర్లకు ఇక్కడ పీర్లు ఘనస్వాగతం పలికి భేటీ తీసుకున్నారు. అక్కడ నుంచి బత్తలపల్లి కూడలికి రెండు గ్రామాలకు చెందిన పీర్లు తరలివచ్చాయి.


బత్తలపల్లిలో ఊరేగుతున్న పెద్ద ఖాసీంస్వామి పీరు

బత్తలపల్లిలో పీర్ల భేటీ

- నలుమూలల నుంచి తరలివచ్చిన జనం
- పీర్ల భేటీని తిలకించి పరవశించిన వైనం

బత్తలపల్లి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొహర్రం ఉత్సవాలకు ప్రసిద్ధిచెందిన గూగూడు కుళ్లాయిస్వామి తర్వాత బత్తలపల్లి మండల కేంద్రంలో పెద్ద ఖాసీం, చిన్న ఖాసీం స్వామి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో పదో రోజైన సోమవారం బత్తలపల్లిలో పీర్ల భేటీ ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, మల్కాపురం గ్రామాల పీర్లు తెల్లవారుజాము నుంచే ఊరేగింపుగా మండల కేంద్రానికి చేరుకున్నాయి. పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం కూడలిలో బత్తలపల్లి చిన్న ఖాసీం, పెద్ద ఖాసీం స్వామి పీర్లతో భేటీ అయ్యాయి. ఆ తర్వాత బత్తలపల్లిలోని చావిడి వద్దకు వెళ్లి చదివింపులు చేశారు. భేటీ సమయంలో భక్తులు బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులను తీర్చుకున్నారు. నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో బత్తలపల్లి జనసంద్రంగా మారిపోయింది. రోడ్లపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.


బత్తలపల్లిలో ఊరేగుతున్న వివిధ గ్రామాల పీర్లు


బత్తలపల్లి పీర్లుతో భేటీ తీసుకుంటున్న పీర్లు

మేడలు, భవనాలపైకి ఎక్కి ప్రజలు భేటీని తిలకించారు. హిందువులు, ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని మతసామరస్యాన్ని ప్రదర్శించారు. డప్పులు, తప్పెట్ల మోతలు, ఈలలు, కేకలతో పరిసర ప్రాంతాలు హోరెత్తిపోయాయి. భక్తులకు పలువురు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్, 70 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. తరలివచ్చిన జనసందోహాన్ని కట్టడి చేశారు. భేటీల అనంతరం పీర్లు ఆయా గ్రామాలకు తరలివెళ్లగా, బత్తలపల్లి అగ్నిగుండం దగ్గర జంతుబలులు గావించారు. సాయంత్రం గ్రామం చివర వరకు పీర్లను తీసుకెళ్లి జలధి నిర్వహించారు. ఈ ఘట్టం చివర అంకానికి చేరుకోవడంతో రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆడ, మగ భేదం లేకుండా అందరూ భక్తిశ్రద్ధలతో అలావ్ తొక్కారు. అనంతరం ఆల్‌బిదాయో...అంటూ విషాద గీతం ఆలపిస్తూ మకాన్‌కు చేరుకున్నారు. బత్తలపల్లిలో మాత్రమే సోమవారం జలధి నిర్వహించారు. మిగిలిన గ్రామాల్లో మంగళవారం జలధి నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల పెద్దలు తెలిపారు. ఇదిలా ఉండగా సంజీవపురం, మాల్యవంతం పంచాయతీలలో సోమవారం పెదసరిగెత్తు వేడుకలను నిర్వహించారు. మంగళవారం భేటీ వెంకటగారిపల్లి సత్రం వద్ద ఉంటుందన్నారు. సాయంత్రం జలధి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

'అనంత'జట్టును ఆదుకున్న దత్తారెడ్డి

- డబుల్ సెంచరీతో సత్తాచాటిన చిత్తూరు ప్లేయర్ అభిషేక్‌రెడ్డి


సెంచరీ సాధించిన మచ్చా దత్తారెడ్డి



డబుల్ సెంచరీ చేసిన అభిషేక్‌రెడ్డి

అనంతపురం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సీనియర్ మల్టీడే మ్యాచ్ ఆర్డీటీ మైదానంలో అనంతపురం, చిత్తూరు జిల్లా జట్ల మధ్య రసవత్తరంగా సాగుతోంది. తొలుత చిత్తూరు జట్టు భారీ స్కోరు సాధించింది. అయితే అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం జిల్లా జట్టు చిత్తూరు బౌలర్ల ధాటికి ఒక దశలో విలవిల్లాడింది. వరుసగా నాలుగు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అనంతపురం జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న రంజీ క్రీడాకారులు గిరినాథ్‌రెడ్డి, మచ్చా దత్తారెడ్డి జట్టును ఆదుకున్నారు. ఇద్దరూ అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో 126 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మచ్చా దత్తారెడ్డి మెరుపు సెంచరీతో మరోసారి ఆకట్టుకున్నాడు. వన్డే మ్యాచ్ తరహాలో ఇన్నింగ్స్ ఆడాడు. గ్రౌండ్ నలుమూలలా బౌండరీలు బాదాడు. కేవలం 83 బంతుల్లో 6 సిక్సర్లు, 11 ఫోర్లతో మచ్చా దత్తారెడ్డి 100 పరుగులు (నాటౌట్)గా నిలిచారు. చిత్తూరు జిల్లా 455 పరుగులు చేసి ఆలౌట్ అయింది. చిత్తూరు బ్యాట్స్‌మెన్ అభిషేక్‌రెడ్డి (240), పృథ్వీరాజ్ (132) పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించారు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన అనంతపురం జట్టు 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది.

డ్రైడేను పాటించేలా చర్యలు

అనంతపురం మెడికల్: దోమకాటు వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డీఎంఓ ఓబులు పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కీటక జనత వ్యాధుల నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమకాటు ప్రభావిత ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓలు గిరిధర్ రెడ్డి, మద్దయ్య, బత్తుల కోదండరామిరెడ్డి, రామకృష్ణ, నాగేంద్ర ప్రసాద్, మునాఫ్, తిరుపాలయ్య, ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు ఆదినారాయణ నాయక్

కూడేరు: తాను చేసిన తప్పుకు తన తల్లిదండ్రులకు చెడ్డపేరు, ఇబ్బందులు వచ్చాయని మనస్తాపంతో ఆదినారాయణ నాయక్ (22) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల పరిధిలోని స్కంద వెంచర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... కాలేనాయక్ కుమారుడు ఆదినారాయణనాయక్. వీరిది వజ్రకరూర్ మండలం పీసీ ప్యాపిలి తండా. ఆదినారాయణ నాయక్‌పై పోక్సో కేసు నమోదు కావడంతో రిమాండ్‌కు వెళ్లి వచ్చాడు. సొంతూరులో ఉంటే మనస్పర్థలు, గొడవలు అవుతాయని కూడేరు మండలం స్కంద వెంచర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. తల్లిదండ్రులు వేరే ఊరికి వెళ్లడంతో తన వల్ల తల్లిదండ్రులకు ఇబ్బందులు వచ్చాయని ఆవేదన చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. అతని తల్లి వచ్చి పిలిచిన పలకకపోడంతో కిటికీలో నుంచి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక మరొకరు..

చిలమత్తూరు: ఒంటరితనం భరించలేక ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వీరాపురం గ్రామానికి చెందిన జయవర్ధన్(28)రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే భార్య వదిలేసి వెళ్లిపోయింది. అప్పటి నుండి తండ్రి, అన్నలతో కలిసి ఉంటున్నాడు. అయితే ఒంటరితనం భరించలేక సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

బ్యాంక్ ఖాతా ఉంటేనే తల్లికి వందనం


అనంతపురం రూరల్: ఇంటర్ చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం పథకం నగదు జమకావాలంటే విద్యార్థులకు తప్పనిసరిగా బ్యాంక్ లేదా పోస్టల్‌ఖాతా తప్పనిసరిగా ఉండాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జ్) రామాంజినేయులు తెలిపారు. ఈ నెల 10న రెండోవిడత తల్లికి వందనం పథకం అమలు చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నగదు జమ కావాలంటే అర్హులైన విద్యార్థులు బ్యాంక్ లేదా పోస్టల్ ఖాతా కలిగి ఉండాలన్నారు. ఈ నెల 9లోగా ఎన్‌పీసీఐ లింక్ పూర్తి చేయాలన్నారు. కళాశాల యాజమాన్యాలు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థులకు ఖాతాలు చేయించాలన్నారు.

పరిశోధనా కేంద్రానికి స్థల పరిశీలన


స్థలాలకు సంబంధించిన మ్యాప్‌ను టీంకు వివరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి రూరల్: 50 ఎకరాల్లో అరటి టిష్యూ కల్చర్ పరిశోధన కేంద్రం ఏర్పాటుపై సోమవారం మండలంలోని తలారి చెరువు, భోగసముద్రం గ్రామాల పరిధిలోని స్థలాలను కలెక్టర్‌తో పాటు బీబీఎస్‌ఎస్‌ఐ టీం ప్రతినిధులు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్న భారతీయ బీజ్ సహకారి సమితి (బీబీఎస్‌ఎస్‌ఐ) తాడిపత్రి ప్రాంతంలో పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది. రెండు గ్రామాల్లో పరిశోధన కేంద్రానికి అవసరమైన భూమి, నీటి వనరులను పరీక్షించి ఒక గ్రామాన్ని ఎంపిక చేయనున్నారు. రెండు గ్రామాల పరిధిలోని స్థలాలను కలెక్టర్ వినోద్ కుమార్, బీబీఎస్‌ఎస్‌ఐకి చెందిన ప్రతినిధులకు పారిస్ దేశాయ్, జయప్రకాష్, తివారిలతో పాటు ఆయా శాఖలకు చెందిన అధికారులు పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు ఈశ్వరయ్య

అనంతపురం: నగరంలోని కళ్యాణ దుర్గం బైపాస్ రోడ్డులో లక్ష్మీ టిఫెన్ సెంటర్ ఎదురుగా సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన వి. ఈశ్వరయ్య (54) రోడ్డు దాటుతుండగా , గుర్తు తెలియని స్కూటీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాయదుర్గం – మొలకాల్మూరు రైలు మార్గంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న బేల్దారి చాంద్‌బాషా (25) మృతి చెందాడు. పట్టణంలోని గ్యాస్ గొడౌన్ ఏరియాకు చెందిన చాంద్‌బాషా కుటుంబ ఆర్థిక సమస్యలతో రైలు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బళ్లారి ఓపీడీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తి తెలిపారు.

వేసవి శిక్షణ ప్రారంభం

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో సత్యసాయి విద్యా సంస్థలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, మానవతా విలువలు అన్న అంశంపై శిక్షణ ఇస్తున్నారు. సోమవారం సాయంత్రం ప్రశాంతి నిలయం క్యాంపస్ విద్యార్థులు రామ కథ పేరుతో ఆధ్యాత్మిక సంగీత విభావరి నిర్వహించారు.

జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం


ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, తదితరులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: జగనన్నను మరోసారి సీఎం చేసుకుందాం.. అందుకు కార్యకర్త నుంచి నాయకుల వరకూ ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్నారై కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆయన సోమవారం నగరానికి వచ్చారు. దీంతో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆలూరు సాంబశివారెడ్డిని గజమాల, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించినందుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. పార్టీ అనుబంధ విభాగాల బలోపేతానికి, సంస్థాగత నిర్మాణాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నేతల సహకారంతో ముందుకెళ్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆలూరు సాంబశివారెడ్డిని కలసిన వారిలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యులు మహాలక్ష్మి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పామిడి వీరాంజినేయులు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రంగంపేట గోపాల్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులునాయక్, ఎంపీపీ రాఘవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు విజయప్రతాప్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, పాలే జయరాం నాయక్, ఎగ్గుల శ్రీనివాసులు, వెన్నపూస రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- పది మంది నిందితుల అరెస్టు
- 1.709 కేజీలు గంజాయి, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం

రాయదుర్గం: గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును రాయదుర్గం పోలీసులు రట్టుచేశారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి కేంద్రంగా సాగిస్తున్న ఈ దందాలో పది మంది నిందితులు పట్టుబడ్డారు. సోమవారం అర్బన్ పీఎస్‌లో కేసుకు సంబంధించిన వివరాలను సీఐ జయనాయక్ వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు రాయదుర్గం రైల్వేస్టేషన్ పరిసరాల్లో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలోని కణేకల్లు రైల్వే బ్రిడ్జివద్ద తనిఖీలు చేయగా .. కంబదూరు మండలం కర్తనపర్తి, కొత్తూరు, చెన్నంపల్లి గ్రామాలకు చెందిన బోయ నరేష్, కొడిపల్లి రామాంజినేయులు, ఎరుకుల మారన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన చిటమ్మరప్ప, అనంతపురం మండలం పూలకుంటకు చెందిన కంటగాని వెంటకరాముడు, అనంతపురం పట్టణానికి చెందిన దంపట్ల జీవన్‌కుమార్, ఇమామ్‌సాబ్, షేక్ అన్వర్‌బాష, గార్లదిన్నె మండలం పాతకల్లుకు చెందిన అంచెల రసూల్‌ఖాన్ నుంచి 1.709 కిలోల గంజాయితో పట్టుబడ్డారన్నారన్నారు. వారి నుంచి గంజాయితో పాటు ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో ముఠాగా ఏర్పడి కొంతకాలంగా గంజాయి వ్యాపారం చేస్తున్నారన్నారు. బళ్లారి రైల్వేస్టేషన్, బస్టాండు ప్రాంతాల్లో ఉన్న సాధువుల దగ్గర కిలో రూ.25 వేలతో కొనుగోలు చేసి అక్కడి నుంచి రైలులో ఏపీలోకి దిగుమతి చేస్తున్నట్లు చెప్పారు. వాటిని చిన్న పాకెట్లుగా మార్చి ఒక్కో పాకెట్ రూ.800కు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారన్నారు. ఎస్పీ జగదీష్‌తో పాటు డీఎస్పీ రవిబాబు సీఐతో పాటు వారి సిబ్బందిని అభినందించారు.

నీట్‌లో ప్రతిభ


చేతన్‌రెడ్డి


సాయి వంశీ

అనంతపురం: నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)- 2025 రాష్ట్రస్థాయి ర్యాంకులు సోమవారం ప్రకటించారు. అనంతపురం నగరానికి చెందిన సునీత, బిక్షంరెడ్డి దంపతుల కుమారుడు బానాల చేతన్‌రెడ్డి నీట్‌లో గణనీయమైన ర్యాంకు సాధించాడు. జాతీయస్థాయిలో 1615వ ర్యాంకు, స్టేట్ ర్యాంకు 83 దక్కించుకున్నాడు. మంచి ర్యాంకు సాధించిన చేతన్ రెడ్డిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు. తల్లిదండ్రుల సహకారంతోనే నీట్‌లో రాణించినట్లు చేతన్‌రెడ్డి తెలిపారు. అలాగే అనంతపురం నగరానికి చెందిన సురేష్, పద్మ సువర్ణ దంపతుల కుమారుడు అవ్వా సాయి వంశీ నీట్‌లో జాతీయస్థాయి 3,780వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 170వ ర్యాంకు సాధించారు. సురేష్ అనంతపురంలో సీనియర్ న్యాయవాది. డాక్టర్ పద్మ సువర్ణ జేఎన్‌టీయూ అనంతపురంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంచి డాక్టర్‌గా పేరు ప్రఖ్యాతలు సంపాదించాలన్నదే తన లక్ష్యమని సాయి వంశీ తెలిపారు.

క్లుప్తంగా

పిటిషన్లకు పరిష్కారం చూపాలి



పిటీషనర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్ బాషా

అనంతపురం: చట్ట పరిధిలో పిటిషన్లకు సరైన పరిష్కారం చూపాలని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై 68 పిటీషన్లు అందాయి. జిల్లా నలుమూల నుంచి విచ్చేసిన ప్రతి పిటిష నర్‌తో డీఎస్పీ మాట్లాడారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి పిటిషన్లకు పరిష్కారం చూపాలని కోరారు.

'రెడ్‌బుక్‌పై ఆనాడే చర్యలు తీసుకోవాల్సింది'

అనంతపురం కార్పొరేషన్: 'రెడ్‌బుక్' పేరును ప్రస్తావించినప్పుడే నారా లోకేష్‌పై చర్యలు తీసుకుని ఉంటే రాష్ట్రంలో అరాచకపాలన, దుర్మార్గపు ఆలోచనలు ఉండేవి కావని వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్ వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. జస్టిస్ శ్రీనివాసరెడ్డిపై కూటమి ప్రభుత్వంలోని తెలుగు తమ్ముళ్లు 'రెడ్‌బుక్ రాజ్యాంగం' పేరుతో చేస్తున్న ట్రోలింగ్‌ను తప్పు పట్టారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా లేదా అని అనక తప్పదన్నారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే విధంగా కూటమి పాలన సాగుతోందన్నారు. బార్ కౌన్సిల్ తీర్మానం ప్రకారం సుప్రీంకోర్టు, కేంద్ర ప్రభుత్వం భవిష్యత్తులో ఇలాంటి దుశ్చర్యలు జరగకుండా న్యాయవ్యవస్థపై ట్రోలింగ్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

కార్మికులకు చీరల పంపిణీ



కార్మికులకు చీరలందిస్తున్న నిత్యసురభి ట్రస్టు ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మహిళా కార్మికులకు చీరల పంపిణీ జరిగింది. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల మురళీ ఆధ్వర్యంలో వివిధ చోట్ల పనిచేస్తున్న శానిటరీ మహిళా కార్మికులకు చీరలు అందజేశారు. డాక్టర్ నిర్మల మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ కార్మికులు చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమన్నారు. ట్రస్టు సభ్యుల సహకారంతో పాతికమందికి ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత సమక్షంలో పసుపు కుంకుమలతో పాటు చీరలలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఇంట్లో పెద్ద వారి స్మారకార్థం మంచి పనికి ముందుండాలని కోరారు. కార్యక్రమంలో సాయి పల్లవి, నాగరాజు, రాము, సరస్వతి, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయికి అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయసాయి

అనంతపురం కల్చరల్: జన జాగృతి సేవా సమితి వారు రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక సేవా కార్యకర్తలకందించే భారత గౌరవ్ సన్మాన్ అవార్డును అనంతపురానికి చెందిన సాయి ట్రస్టు చైర్మన్ విజయ్‌కుమార్ సోమవారం అందుకున్నారు. హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఇస్కాన్ ఇన్‌చార్జ్ ప్రణవానంద దాసు, ఇస్కాన్ మందిర ప్రతినిధి శ్రీకాంత్ ప్రభు, నిర్వాహకులు ప్రదీప్‌కుమార్ చేతుల మీదుగా ఆయన అవార్డుతో పాటూ సత్కారమందుకున్నారు. సాయిట్రస్టు 36 ఏళ్లుగా చేస్తున్న సేవలను నిర్వాహకులు కొనియాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం కార్పొరేషన్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు సోనగరపాలక సంస్థ ముందు ధర్నా చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్ మాట్లాడుతూ మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులలంటూ ఆన్‌లైన్‌తో నమోదు చేసి పథకాలు వర్తింపజేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తోందని మండిపడ్డారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి వేణు గోపాల్, సమితి సభ్యులు నాయుడు, రామాంజినేయులు, కుళ్లాయ్ రెడ్డి, లక్ష్మినారాయణ, బాలు, కుళ్లాయమ్మ, కాంతమ్మ, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

- రాప్తాడులో పలు సేవా కార్యక్రమాల నిర్వహణ



రాప్తాడులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం నియోజకవర్గ కేంద్రం రాప్తాడులో పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి లింగారెడ్డి, వైస్ ఎంపీపీ, బీసీ సెల్ అధ్యక్షుడు బోయ రామాంజినేయులు తెలిపారు. సోమవారం వారు రాప్తాడు వైఎస్సార్ సర్కిల్‌లో రాజశేఖరరెడ్డి విగ్రహం దగ్గర జయంతి ఏర్పాట్లను పరిశీలించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 9 గంటలకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం, భారీ కేక్ కటింగ్, యువకులతో రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న యువకులు రక్తదానం చేయాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు బీసీ సెల్ ఆధ్వర్యంలో అన్నదానం చేస్తామన్నారు. వైఎస్సార్ జయంతి వేడుకలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు, రైతులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా వలంటీర్ల విభాగం అధ్యక్షుడు హరినాథ రెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షుడు మామిళ్లపల్లి అమర్‌నాథ్ రెడ్డి, రామగిరి, రాప్తాడు మండల కన్వీనర్లు మీనుగ నాగరాజు, సాకే వెంకటేష్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ జూటూరు లక్ష్మన్న, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల యూత్ కన్వీనర్ బుద్దారెడ్డి గారి విశ్వనాథ్ రెడ్డి, నాయకులు యాలకుంట్ల అమర్ నాథ్ రెడ్డి, చింతకాయల జయన్న తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలోని మార్కెట్ సర్కిల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగముని పిలుపునిచ్చారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం చెన్నేకొత్తపల్లిలోని వైఎస్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి ఓ ప్రకటనలో తెలిపారు.

నమో నారసింహా....

- పూల పల్లకీలో భక్తులకు దర్శనమిచ్చిన ఓబుళ లక్ష్మీనారసింహుడు



దివిటీల వెలుగులో స్వామివారి ఊరేగింపు

చెన్నేకొత్తపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నేకొత్తపల్లిలో శ్రీ ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చెన్నేకొత్తపల్లి సమీపంలోని కొండ నుంచి స్వామి వారి ప్రతిమలను అలయ పూజారులు తీసుకువచ్చారు. వెంకటంపల్లి రోడ్డులోని వంక వద్ద ప్రతిమలకు బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు చేశారు. పూల పల్లకీలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ఆభరణాలతో అలంకరించారు. పూల పల్లకీని మేళతాళాలతో పట్టణంలోని ప్రధాన వీధులలో ఆదివారం రాత్రి ఊరేగించారు. సోమవారం తెల్లవారుజామున స్వామి వారి ఊరేగింపు దేవాలయానికి చేరుకుంది.ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నమో నారసింహ.. గోవిందా గోవింద అని స్మరించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు సహపంక్తి భోజనం(దాసంగం) ఏర్పాటు చేశారు.

కొండమీద నృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

ఎర్రజిన్నన్నగారిపల్లిలో తొలి ఏకాదశి ఉత్సవాలలో భాగంగా గ్రామ సమీపంలోని కొండపై వెలసిన శ్రీ నృసింహస్వామికి ప్రత్యేక పూజలు, స్వామి వారి పరుషను నిర్వహించారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: అధిక వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు సీపీ ఓబిలేసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఒక మహిళను కట్టేసి కొట్టిన ఘటన మరువకనే అనంతపురంలో బంగారుగేరిలో బాబ్‌జాన్ అనే వ్యక్తిని వడ్డీ వ్యాపారులు దారుణంగా కొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీ చెల్లింపు కాస్త ఆలస్యమైనా అందరి ముందు బూతులు తిడుతూ పని ప్రదేశంలోనే మర్యాద తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో భవానీ నగర్, రాణీనగర్, నవోదయ కాలనీల్లో అధిక వడ్డీ వ్యాపారుల దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయన్నారు. అప్పు వసూలు సమయంలో మహిళల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తున్నారన్నారు. వీరి ఆగడాలు భరించలేక ఎంతోమంది అప్పు తీసుకున్నవారు ఊరు విడిచి వెళ్తున్నారన్నారు. మరికొంతమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారన్నారు. తమిళనాడు రాష్ట్రం తరహాలో అధిక వడ్డీ, బలవంతంగా డబ్బు వసూళ్లకు పాల్పడితే ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5లక్షల జరిమానా విధించేలా కఠిన చట్టం తేవాలని డిమాండ్ చేశారు. నగరంలో రౌడీషీటర్ల కంటే అధిక వడ్డీ వ్యాపారులు ప్రమాదకరంగా మారారని, అలాంటి వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, జిల్లా బహిష్కరణ చేయాలని కోరారు. ఎవరైనా బాధితులు స్టేషన్‌ను ఆశ్రయిస్తే ఫిర్యాదు కూడా తీసుకోకపోవడంతో వడ్డీ వ్యాపారులు తమకు ఎదురు లేదంటూ రెచ్చిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ శింగనమల అధ్యక్షుడు వడియంపేట మంత్రి ఆంజనేయులు, నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

'మా వారి ఆచూకీ తెలపండి'

తాడిపత్రి టౌన్: తాడిపత్రి కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆచూకీ చెప్పాలని బాధిత కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులను ప్రశ్నిస్తున్నారు. వివరాలు.. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశు, వెంకటనారాయణ, రంగనాయకులు, బాలరంగ స్వామి, గంపయ్య, రామచంద్ర గత సార్వత్రిక ఎన్నికల సమయంలో గ్రామంలో జరిగిన ఘర్షణ కేసులో సోమవారం తాడిపత్రి కోర్టుకు వచ్చారు. కోర్టు కేసు వాయిదా వేయడంతో కోర్టు నుంచి బయటకు వచ్చిన వారిని ఓ ప్రవేట్ వాహనంలో పోలీసులు అనంతపురం వైపు తీసుకెళ్లారని బాధిత బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులు తమకేమి తెలియదని చెబుతున్నారు. తాడిపత్రి ఎస్‌ఐ గౌస్‌బాషాను సంప్రదించగా.. తాడిపత్రి కోర్టుకు వచ్చిన వారిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేసేందుకు సిద్ధపడుతుండటంతో వారిని పెద్దపప్పూరు పోలీసులకు అప్పగించామన్నారు. పెద్దపప్పూరు ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ వివరణ ఇస్తూ.. వరదాయపల్లికి చెందిన వేరే వ్యక్తులు మా దగ్గర వున్నారని.. కోర్టుకు హాజరయ్యేందుకు వచ్చిన వారు మా వద్ద లేరని చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆరుగురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పోలీసులు మాయం చేసి ఆచూకీ తెలియదని చెబుతుండటంతో గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ఉంటే చట్ట ప్రకారం నడుచుకోవాలి అని.. ఇలాంటి చర్యలు తీసుకోవడం ఏమిటని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

శాకంబరిగా రేణుకా ఎల్లమ్మ



అలంకరణలో రేణుకా ఎల్లమ్మ

అనంతపురం కల్చరల్: ఆషాఢ మాసంలో వచ్చే అనురాధ నక్షత్రం సందర్భంగా చంద్రశేఖరేంద్ర మహాస్వామి వారి ఆరాధనను పురస్కరించుకుని సోమవారం జీసస్ నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ తల్లికి విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు పార్థసారథి ఆధ్వర్యంలో ఉదయమే అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అదే విధంగా గణపతి గాయత్రి చండీ సహిత రుద్రహవనం, మధ్యాహ్నం పూర్ణాహుతి, మహా మంగళ నీరాజనం తదితర కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. వందలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలందుకున్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు



గొందిరెడ్డిపల్లిలో అగ్ని గుండ ప్రవేశం చేస్తున్న పీర్లు



ఆత్మకూరులో జలధికి తరలుతున్న పీర్లు

రాప్తాడు: మండలంలోని గొందిరెడ్డిపల్లి, గంగలకుంట గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు ముగిశాయి. పీర్ల జలధి ఉత్సవాన్ని ఆయా గ్రామాల్లో హిందూ ముస్లింలు వైభవంగా నిర్వహించారు. యువకులు అగ్నిగుండం ముందు ఉత్సాహంగా అలాయ్ ఆడారు. సాయంత్రం పీర్ల దేవుళ్లను గ్రామాల్లో ఊరేగించి జలధికి తీసుకెళ్లారు. గొందిరెడ్డిపల్లిలో దాదాపు 200 మంది అగ్ని గుండ ప్రవేశం చేయగా..వారిలో 50 మందికి పైగా గాయాలపాలయ్యారు. అలాగే మండలంలో భోగినేపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో పెద్ద సరిగెత్తు నిర్వహించారు.

ఆత్మకూరు: మండలంలోని ఆత్మకూరు, పి.యాలేరు గ్రామాల్లో మొహర్రం వేడుకలు సోమవారం ముగిశాయి. ఆత్మకూరులో సోమవారం తెల్లవారుజామున పీర్ల స్వాములకు గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆత్మకూరు జనసంద్రంగా మారింది.

నేటి నుంచి గురుపౌర్ణమి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని మూడో రోడ్డులో వెలసిన శ్రీషిరిడిసాయి మందిరంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర ప్రతినిధులు తెలిపారు. బాబా మందిరం నిర్మాణమై 15 ఏళ్లు దాటిన దృష్ట్యా వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు నర్తన డ్యాన్స్ అకాడమీ అమూల్య హరీష్ వారి ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలతో పాటు 'శ్రీషిరిడిసాయినాథుని నాటకం' ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

రాప్తాడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సత్వరమే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రామినేపల్లి, భోగినేపల్లి గ్రామాల్లో సీపీఐ శాఖ మహసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో పథకాలు ప్రకటిస్తాయి తప్పా ఏ ఒక్కటీ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా ఒక పథకం కూడా సక్రమంగా అమలు కాలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్ది రాజు, మారెన్న, మమత, నాగేంద్రమ్మ, నాగన్న, గాయిత్రి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నగర ఖాజీగా జావీద్ హుస్సేన్



అనంతపురం కల్చరల్: నగర ప్రభుత్వ ఖాజీగా మౌలానా జావీద్ హుస్సేన్‌కు మరోసారి అవకాశం కల్పించారు. ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం నగరానికి ఒకరు మాత్రమే ఖాజీగా ఉండే స్థితి నుండి గత ప్రభుత్వం 12 వార్డులకొకరు చొప్పున నలుగురు ప్రభుత్వ ఖాజీలను నియమించింది. అదే ఒరవడిలో ఇప్పుడు కూడా పాతూరు భాగ్యనగర్ ప్రాంతాల పరిధిలో జావీద్ హుస్సేన్‌ను తిరిగి నియమించారు.

ల్యాప్‌టాప్ అప్పగింత



వస్తువులను బాధితురాలికి అందజేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: అనంతపురం నగరానికి చెందిన తేజశ్విని బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం బెంగళూరు నుంచి అనంతపురానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. బస్సులో నిద్రించిన ఆమె మార్గమధ్యంలోని రాప్తాడు వద్ద మేల్కొని చూడగా ల్యాప్‌టాప్,లగేజీ బ్యాగులు కనిపించకపోవడంతో వెంటనే తన సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. తర్వాత సోదరుడితో కలసి చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్‌ఐ సత్యనారాయణ చెన్నేకొత్తపల్లిలో ఉత్సవాలు జరుగుతుండటంతో మైక్ ద్వారా విషయాన్ని అనౌన్స్ చేయించారు. కొద్ది నిమిషాల తరువాత బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి ల్యాప్‌టాప్, లగేజీ బ్యాగ్‌ను చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. తర్వాత వాటిని బాధితురాలికి అందజేశారు.

నేడు రామినేపల్లిలో ప్లాంటేషన్

రాప్తాడు: ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కల పెంపకాన్ని మంగళవారం రామినేపల్లిలో ప్రారంభిస్తున్నామని ఏపీఓ సావిత్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా చిన్న, సన్న కారు రైతులు ఉపాధి హామీ పథకం కింద 147 ఎకరాల్లో మామిడి, సపోట, దానిమ్మ, చీనీ, మునగ, సీతాఫలం, బత్తాయి, జామ, అల్లనేరేడు, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు మరికొన్ని పండ్ల మొక్కల పెంపకానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా రామినేపల్లిలో శ్యామల అనే మహిళా రైతు రెండు ఎకరాల పొలంలో చీనీ ప్లాంటేషన్ ప్రారంభిస్తున్నామన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



రాప్తాడులో పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

రాప్తాడు: కార్మికులకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామాంజినేయులు డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌ల రద్దు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌తో ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం వారు సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ నెల 9న రాప్తాడు పంగల్ రోడ్డు దగ్గర సమ్మె చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి, విజయలక్ష్మీ, లక్ష్మీదేవి, మల్లేశ్వరమ్మ, సావిత్రి, హమాలీలు సుబ్బారావు, ప్రతాప్, ప్రకాష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక పాలనకు మూల్యం తప్పదు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఐక్య కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. దేశంలో, రాష్ట్రంలో పాలకులు నిర్బంధ, నిరంకుశ విధానాలను అమలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలంటూ ఐక్య కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగేంద్రకుమార్, రాజారెడ్డి, వైఎస్సార్‌టీయూ, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఓబిరెడ్డి, ఏసురత్నం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తూ కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని మండిపడ్డారు. కార్మిక సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వాలకు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, సీఐటీయూ నాయకులు గోపాల్, వెంకటనారాయణ, ముత్తూజ, వైఎస్సార్‌టీయూ నాయకులు ఖాజా, అనిల్, ఏఐటీయూసీ నాయకులు రామకృష్ణ, కృష్ణానాయక్, మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు సంజీవరాయుడు, మల్లికార్జున, తదితరులు పాల్గొనారు.